## క్లుప్తంగా

### రాయలసీమలోని సంస్థలను తరలించవద్దు

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాయలసీమలో నెలకొల్పిన సంస్థలను అమరావతి తరలించవద్దని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమలోని ఎంఎస్ఎంఈ, ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని తరలించడాన్ని వ్యతిరేకిస్తూ రాయలసీమ వ్యాప్తంగా సోమవారం అన్ని మండల కేంద్రాల్లో తహసీల్దారులకు వినతి పత్రాలు ఇవ్వనున్నామన్నారు. రాయలసీమ వ్యాప్తంగా అవగాహన సమావేశాలు నిర్వహిస్తామని, అందరినీ కలుపుకొని కలెక్టరేట్ వద్ద ప్రత్యక్ష ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్వీయూ రాష్ట్ర కార్యదర్శి సిద్ధి రామయ్య, ఆర్‌సీపీ నగర కార్యదర్శి మక్బూల్ బాషా, నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్, చాపల సుబ్బరాయుడు, లక్ష్మీదేవి, విజయ్, రమేష్, మునిరెడ్డి పాల్గొన్నారు.

### నగర వాసులకు చోరీల భయం

కడప కార్పొరేషన్: కడప నగరం 14వ డివిజన్ పరిధిలోని ప్రకాష్ నగర్‌లో ఇటీవల జరిగిన చోరీలు ప్రజలను భయపెడుతున్నాయి. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని స్థానికులు ఆందోళన పడుతున్నారు. రెండు నెలల కిందట బీసీ హాస్టల్ సమీపంలో ఓ ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ జరిగింది. ఏడు తులాల బంగారు, డబ్బు దుండగులు దోచుకెళ్లినట్లు తెలుస్తోంది. రెండు రోజుల కిందట చంద్రమౌళి నగర్‌లోని ఓ వితంతువు ఇంట్లో దొంగలు చొరబడ్డారు. నోట్లో గుడ్డలు కుక్కి, కత్తితో బెదిరించి బంగారు గాజులు, మెడలో చైన్ దోచుకెళ్లినట్లు సమాచారం. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు కావడంతో దొంగ పట్టుబడినట్లు తెలుస్తోంది. ఇలా ఎక్కడో ఒకచోట చోరీ జరుగుతుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో పోలీసులు గస్తీ మరింత పెంచాలని, రాత్రిళ్లు పెట్రోలింగ్ చేయాలని పలువురు కోరుతున్నారు.

### దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న వివేకానంద ఫౌండేషన్ ప్రతినిధులు

కడప కల్చరల్: పోరుమామిళ్లకు చెందిన వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడప నగరంలోని నిరుపేదలకు దుప్పట్లు ఆదివారం పంపిణీ చేశారు. పట్టణంలోని రోడ్లు, ఆలయాలు, బస్టాండులో చలి, దోమలతో ఇబ్బందిపడుతున్న అభాగ్యులకు దుప్పట్లు అందజేశారు. సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పట్టణంలో అవసరమైన వారికి రాత్రి 11 గంటల నుండి 4 గంటల వరకు దుప్పట్లు అందజేశామన్నారు. ఏ ఆదరణ లేనివారికి తమ సేవాశ్రమంలో ఉచితంగా ఆశ్రయం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు టి.వెంకటసురేష్, కేతన శ్రీనాథ్, యం.రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

### గండికోటలో టోల్ వసూలు చేయడం దారుణం



మాట్లాడుతున్న వీరనాల శివకుమార్

కడప వైఎస్ఆర్ సర్కిల్: గండికోటకు వచ్చే పర్యాటకులతో టోల్ ఫీజు వసూలు చేయడం దారుణమని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర పురావస్తు శాఖ ఆధీనంలో ఉన్న పర్యాటక ప్రాంతానికి టోల్ వసూలు చేయడం విడ్డూరంగా వుందన్నారు. గండికోట అభివృద్ధికి రూ.70 కోట్లు విడుదల చేశామని మంత్రి చెబుతుంటే.. పర్యాటకుల వద్ద నుండి డబ్బు వసూలు చేస్తూ మాన్యువల్ టికెట్లు ఇవ్వడం తగదన్నారు. పార్కింగ్ చేసిన వాహనాలకు భద్రత లేని పరిస్థితి ఉందన్నారు. పర్యాటకుల జేబులకు చిల్లు వేసే ఈ పద్ధతికి స్వస్తి చెప్పాలన్నారు. ఈ సమావేశంలో నరసింహులు పాల్గొన్నారు.

### పేదలకు రేషన్ కార్డులు

కడప కార్పొరేషన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పేదలకు కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేస్తోందని, అర్హులైన వారంతా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జఘన్య గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్ చైర్మన్, టీడీపీ నాయకులు పందిటి డేవిడ్ అన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలలకే కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. డిసెంబర్ 2 నుంచి కొత్త రేషన్ కార్డులు, పింఛన్లకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు.

### మారెమ్మకు పూజలు

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగరంలోని ఎర్రముక్కపల్లె మారెమ్మ తల్లిని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త నుందూరి శ్రీనివాస్ దంపతులు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు పూలమాల, శాలువాతో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సట్టి భారవి, సట్టి మాధవి, సట్టి భాస్కర, నీరజ, వనజ, శ్రీనివాసులు, సుశీలమ్మ, తులసీశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవింగ్ ట్రాక్‌పై ఇక రయ్ రయ్



డ్రైవింగ్ ట్రాక్‌కు గ్రావెల్‌తో గోతులు పూడ్చుతున్న జేసీబీ



ఎఫ్‌సీ ట్రాక్‌కు మరమ్మతులు చేస్తున్న యంత్రం

వర్షం కురిస్తే చాలు.. నీరు నిలిచి వాహనాలు నడిపేందుకు వీలులేకుండా తయారయ్యే ఊటుకూరు ఉప రవాణా శాఖ కార్యాలయం పరిధిలోని డ్రైవింగ్ ట్రాక్‌తో ఇటు వాహన దారులు, అటు అధికారులు ఇబ్బందిపడ్డారు. కొన్నిసార్లు వాహన చోదకులకు నిర్వహించే టెస్ట్‌ను వాయిదా వేయాల్సి వచ్చేది. అలాగే వర్షం పడినపుడు అధికారులు జాతీయ రహదారి ప్రక్కన వాహనాలకు ఎఫ్‌సీ చేయాల్సిన పరిస్థితి. ఇది గ్రహించిన అధికారులు ఎట్టకేలకు గోతులు పూడ్చి వేశారు. పలు చోట్ల మరమ్మతులు చేయడంతో ట్రాక్‌పై ఇక వాహనాలు రయ్ రయ్‌మని దూసుకు పోవచ్చు. డ్రైవింగ్ ట్రాక్‌కు అధికారులు మరమ్మతులు చేయించారు.

– కడప వైఎస్ఆర్ సర్కిల్

## కమ్మేసిన ముసురు



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కడప నగరంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి నల్లటి మబ్బులు కమ్మేసి సన్నటి జల్లులు కురిశాయి. కొద్దిసేపు విరామం ఇచ్చి రోజంతా తుంపరతో కూడిన వాన కురుస్తూనే ఉంది. వానకు తోడు చలి కూడా తోడవడంతో ప్రజలు గొడుగులు, స్వెట్టర్లతో బయటికి వచ్చారు. వర్షంతో వీధి వ్యాపారులు, పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందిపడ్డారు. పలుచోట్ల విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

–కడప కార్పొరేషన్

## నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్ పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ విజయనగరం జిల్లాలో ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలు ఘనంగా జరిగాయన్నారు. జిల్లా కార్యదర్శి గుజ్జల వలరాజును రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకోవడం అభినందనీయమన్నారు. విద్యను రాష్ట్రాల జాబితాకు మార్చాలని, విద్యారంగానికి ప్రత్యేకంగా నిధులు అందించాలని కోరారు. కేజీ నుండి పీజీ మరియు పరిశోధన స్థాయి వరకు ఉచిత విద్య అందించాలని కోరారు. ఒక్కొక్క యూనివర్సిటీకి రూ.100 కోట్లు కేటాయించి, బోధన, బోధనేతర పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే జీవోలను రద్దు చేయాలనే తదితర డిమాండ్‌తో పోరాటం చేస్తామన్నారు. పులివెందుల మెడికల్ కళాశాల సీట్లు వంఎటనే భర్తీ చేయాలని కోరారు. వైవీయూ యూనివర్సిటీకి నిధులు కేటాయించి ఆర్కిటెక్ యూనివర్సిటీకి స్థలం కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్, చంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు జె.శివశంకర్, నగర కార్యదర్శి శివ తేజ, మని ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## నగర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ఉద్యమం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప నగర అభివృద్ధే లక్ష్యంగా ఉద్యమాలు చేపడతామని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. నగరంలోని రామకృష్ణనగర్‌లో సీపీఎం నగర మహాసభ ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అదానీతో చేసుకున్న ఒప్పందాలను కూటమి ప్రభుత్వం వెంటనే రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే వామపక్షాలు గెలవాలన్నారు. కమ్యూనిస్టుల అభిప్రాయాలను ప్రజల ఆహ్వానిస్తున్నారని, వర్గ దృక్పథంతో వారి ఆలోచనలు రాజకీయ శక్తిగా మార్చాల్సిన బాధ్యత సీపీఎం సభ్యులపై ఉందన్నారు. అనంతరం సీపీఎం నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్ గడిచిన మూడేళ్ల కార్యక్రమాల నివేదిక సమర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐ.ఎన్.సుబ్బమ్మ, జి.శివకుమార్ మాట్లాడుతూ నగరంలో పేదలు నివశించే ప్రాంతాలైన ఆర్‌కే నగర్, భగత్ సింగ్ నగర్, సుందరయ్య నగర్ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, బుగ్గవంక ఆధునీకరణకు నిధులు కేటాయించాలని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కోరారు. కడప కార్పొరేషన్ లో పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య పెంచాలని, నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దస్తగిరి రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామకృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, జమీల, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## మల్లేష్ మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు



బాల మల్లేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: సీపీఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాల మల్లేష్ మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు అని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర అన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో తెలంగాణ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేష్ చిత్రపటానికి ఆదివారం పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల మల్లేశ్ శనివారం గుండెపోటుతో మృతి చెందారన్నారు. ఆయన కమ్యూనిస్టు పార్టీకి చెందిన సేవలను ఎన్నటికీ మరువలేమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎస్.వెంకటశివ, సుబ్రహ్మణ్యం, పి.చంద్రశేఖర్, జి.వేణుగోపాల్, గంగా సురేష్, జి.మద్దిలేటి, శివశంకర్, తేజ, చంద్ర, నాగార్జున, రాణి కల్పన, రమణమ్మ, పక్కీరప్ప, తదితరులు పాల్గొన్నారు.

## శిల్పారామంలో ముందస్తు క్రిస్మస్ సందడి



క్రిస్మస్ తాతతో చిన్నారులు

కడప కల్చరల్ : శిల్పారామంలో ముందస్తు క్రిస్మస్ సందడి కనిపించింది. ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా ఎప్పటిలా సంప్రదాయ వేదికపై ప్రదర్శించే నృత్యాలకు బదులు ఆదివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఉత్సాహభరితంగా నిర్వహించారు. పలు క్రైస్తవ, ఔత్సాహిక యువ సంఘాల ప్రతినిధులు ప్రాంగణంలో పెద్ద స్టార్‌ను విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసి వెలిగించారు. దాని చుట్టూ క్రిస్మస్ ట్రీ కటౌట్లు ఉంచారు. వేదికపై క్రిస్మస్ తాత వేషధారులు పిల్లలతో ఆడిపాడి అలరించారు. చిన్నారుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆయన చిన్నారులకు చాకెట్లను పంచిపెట్టి హ్యాపీ క్రిస్మస్, మేరీ క్రిస్మస్ చెబుతూ ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో పట్టణవాసులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవమైంది
– డీఈఓ మీనాక్షి



ఉపాధ్యాయురాలు మహబూబ్‌చాంద్, డీఈఓ మీనాక్షిలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవమైందని కడప డీఈఓ మీనాక్షి అన్నారు. చెన్నూరు బాలుర ఉర్దూ హైస్కూల్‌లో పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయురాలు మహబూబ్ చాంద్ సన్మాన సభ ఆదివారం కడప ఉమేష్‌చంద్ర కళ్యాణ మండపంలో నిర్వహించారు. డీఈఓ మీనాక్షి మాట్లాడుతూ నేటి ఉపాధ్యాయ లోకానికి మహబూబ్ చాంద్ సేవలు ఎంతో ఆదర్శమని కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తిలో 41 సంవత్సరాలు విద్యార్థులను తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషి చేశారన్నారు. సబ్జెక్టు టీచర్‌ను నియమించే వరకు విద్యార్థులకు ఉచితంగా విద్య బోధన చేస్తాననడం అభినందనీయం అన్నారు. అనంతరం మహబూబ్‌చాంద్, డీఈఓ మీనాక్షిలను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పద్మనాభం, ఎంఈవో సునీత, కర్నూలు డైట్ ఇంచార్జ్ ప్రిన్సిపల్ ఎన్.అయూబ్ హుస్సేన్, ఎస్ఎండీ.ఇలియాస్‌బాషా, సయ్యద్ ఇక్బాల్, అబ్దుల్ రజాక్, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

### బిట్స్ బుక్‌లెట్స్‌తో ఉత్తీర్ణత సులభతరం



బిట్స్ బుక్‌లెట్ విడుదల చేస్తున్న జేఏసీ చైర్మన్ శ్రీనివాసులు,రవికుమార్, తదితరులు

కడప ఎడ్యుకేషన్: డిపార్ట్‌మెంట్ పరీక్షల ఉత్తీర్ణతకు బిట్స్ బుక్‌లెట్స్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. కడప ఎన్జీవో భవన్‌లో డిపార్టుమెంటల్ పరీక్షల బిట్స్ బుక్‌లెట్‌ను ఆదివారం విడుదల చేశారు. జేఏసీ చైర్మెన్ శ్రీనివాసులు మాట్లాడుతూ మెటీరియల్‌లోని మోడల్ పేపర్లు పరిశీలించి సులభంగా పరీక్ష రాసేందుకు వీలుంటుందన్నారు. ఏపీ ఎన్జీవో జిల్లా కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ డిపార్టుమెంట్ పరీక్షలు దిశా నిర్దేశం చేసే విధంగా బుక్‌లెట్ రూపొందిందని, వాటి ద్వారా సాధన చేస్తే ఉద్యోగులు పరీక్షల్లో విజయం సాధిస్తారన్నారు. ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ.ప్రసాద్ మాట్లాడుతూ సర్వీసు నిబంధనలపై అవగాహన పెంచుకొనేలా బుక్‌లెట్ తయారు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అమరావతి కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, అలీఖాన్, అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమాకాంత్, చంద్రశేఖర్ రెడ్డి, గఫార్, రాజగోపాల్, వీరప్రసాద్, ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఏపీ టూరిజం హాల్‌లో వన భోజనాలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మ ఆలయం వద్ద ఏపీ టూరిజం హాలులో ఆదివారం బలిజ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సగినాల శ్రీనివాసులు, కార్యదర్శి రెడ్డయ్య ఆధ్వర్యంలో కార్తిక వనభోజనాల కార్యక్రమాన్ని సీవీఎస్ మూర్తి ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన పెద్దలు మాట్లాడుతూ బలిజ సంఘం అభివృద్ధికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వేమన పద్య పఠన పోటీలు



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ జీవీ.సాయిప్రసాద్‌రెడ్డి

కడప కల్చరల్: రెడ్డి సేవా సమితి రజతోత్సవ వేడుకను పురస్కరించుకుని విద్యార్థులకు వేమన పద్య పఠన పోటీలు ఆదివారం నిర్వహించారు. స్థానిక రాజీవ్‌మార్గ్‌లోని రెడ్డి సేవాసమితి కార్యాలయంలో జరిగిన ఈ పోటీల్లో 45 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జీవీ.సాయిప్రసాద్‌రెడ్డి, లెక్కల కొండారెడ్డి మాట్లాడుతూ నాగార్జున మోడల్ స్కూల్‌కుచెందిన బీవీ జాహ్నవి, ఎం.వైష్ణవి ప్రథమ, ద్వితీయ బహుమతులు, ప్రొద్దుటూరు దొరసానిపల్లె జెడ్పీ హైస్కూలుకు చెందిన పీసీ లాలిత్యరెడ్డి తృతీయ బహుమతి గెలుచుకున్నారన్నారు. వరుస బహుమతులుగా వారికి రూ.15000, రూ.12000, రూ.10000 చొప్పున బహుమతి జనవరి 19న అందజేయనున్నట్లు తెలిపారు. కె. లక్ష్మి కీర్తన, ఎస్.మౌనిక, ఎస్.జైనబ్, పి.ఉషశ్రీ, సి.గణేష్‌కుమార్‌రెడ్డి, ఎస్.స్వర్ణ, పి.భవిష్యారెడ్డిలకు రూ.2 వేల చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. ఈ పోటీలకు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ పాదిలినాగరాజు, డాక్టర్ జీవీ సాయిప్రసాద్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. రెడ్డి సేవా సమితి కడప అధ్యక్షులు డాక్టర్ కుప్పిరెడ్డి నాగిరెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. గుడ్ల ఆదినారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జి.వెంకటరెడ్డి, ఎం.నాగేంద్రారెడ్డి, డాక్టర్ మద్దిక సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## రక్తదానమంటే.. ప్రాణాలు నిలపడమే



మాట్లాడుతున్న రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ అహ్మద్

కడప సెవెన్‌రోడ్స్: రక్తాన్ని దానం చేయడమంటే ఆపదలో ఉన్నవారి ప్రాణం కాపాడటమేనని ఆంధ్రప్రదేశ్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ అహ్మద్ పేర్కొన్నారు. దూదేకుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నగరంలోని పాత కలెక్టరేట్ ఎదుట ఆదివారం కడప నిర్వహించిన 14వ రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ యేటా ఎయిడ్స్ దినోత్సవం రోజున దాతల నుంచి రక్తం సేకరించి బ్లడ్ బ్యాంకుకు అందజేస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు తలసేమియా వ్యాధిగ్రస్తులు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి రక్తం అవసరమని చెప్పారు. దూదేకుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మన్సూరు అక్బర్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా సేవలందించాలనే ఉద్దేశ్యంతోనే క్రమం రక్తదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో హరిప్రసాద్, డాక్టర్ అబిద్, పీఎం.బాషా, రూపనగుడి హుసేన్, జి.నజీర్, బంద్రేవు గురుషరీఫ్, బాబయ్య, నబీరసూల్, జిలానీబాషా, సుబాన్‌బాషా, ఖాదర్‌బాషా, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

## తెలుగు భాషాభివృద్ధికి బ్రౌన్ సేవలు అపూర్వం




శ్రీనివాస్ దంపతులను సత్కరిస్తున్న జానమద్ది విజయభాస్కర్

కడప కల్చరల్: తెలుగు భాష ఉద్ధరణకు బ్రౌన్ చేసిన కృషి అపూర్వమని ప్రవచన కారుడు నందూరి శ్రీనివాస్ అన్నారు. నగరంలోని చార్లెస్ ఫిలిప్ గ్రంథాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషాభిమానులు బ్రౌన్‌ను మరువలేరని, ఆయన పేరిట గొప్ప గ్రంథాలయాన్ని నిర్మించడం ప్రశంసనీయమన్నారు. తొలి తెలుగు ఆంగ్ల నిఘంటువు రూపొందించి తాళపత్రాలలో నిక్షిప్తమైన సాహితీ సంపదను వెలికి తీసిన కారణ జన్ముడు బ్రౌన్ అన్నారు. బ్రౌన్ గ్రంథాలయాన్ని దర్శించదగిన స్థలంగా ప్రకటించి ఆయన జయంతి, వర్ధంతి నిర్వహించాలని కోరారు. అనంతరం శ్రీనివాస్ దంపతులను జానమద్ది విజయభాస్కర్, విజయలక్ష్మి దంపతులు ఘనంగా సత్కరించారు. బ్రౌన్ గ్రంథాలయ ప్రచురణల గౌరవ సభ్యత్వ పత్రాన్ని సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్‌రావు, హరిభూషణ్, రమణి, నీలకంఠ, రాణి పాల్గొన్నారు.

## ఎయిడ్స్‌పై ఎన్సీసీ విద్యార్థుల చైతన్య ర్యాలీ



సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థినులు




శివాజీ నగర్‌లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ర్యాలీ

వైవీయూ: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్సీసీ విద్యార్థులు ఆదివారం చైతన్య ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ కోటిరెడ్డి సర్కిల్, ద్విశతాబ్ది (సంధ్యా) సర్కిల్ మీదుగా డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించేలా ర్యాలీ నిర్వహించిన ఎన్సీసీ కేడెట్స్‌కు జిల్లా మెడికల్ అండ్ హెల్త్ అధికారులు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

- వైవీయూ ఎన్ఎస్ఎస్ యూనిట్–9 ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైవీయూ దత్తత గ్రామమైన శివాజీ నగర్‌లో ఆదివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. వాలంటీర్లు మానవహారం నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు అందరూ కలిసిరావాలని సూచించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- కడప ఎడ్యుకేషన్: నేటి యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ప్రిన్సిపల్ నూర్జహాన్ అన్నారు. ఎయిడ్స్ డే సందర్భంగా ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆదివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నూర్జహాన్ మాట్లాడుతూ హెచ్ఐవీని నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజారావు మాట్లాడుతూ ఆరోగ్యమే నాకు నిదానంతో పిల్లలు ముందుకెళ్లాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హరిప్రసాద్ రెడ్డి, శ్రీరాములరెడ్డి, దక్షిణామూర్తి, వెంకట్రాంరెడ్డి, చంద్రమౌళి, యోగేశ్వర్‌రెడ్డి, అమృతరాజు, సుధాకర్ రెడ్డి, అమీరుల్లాన్, కృష్ణవేణి, విద్యావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## మేమింతే.. అడ్డంగా కూర్చుంటాం



కడప నగరంలోని రాజీవ్ మార్గ్‌లో నడిరోడ్డుపై ఆదివారం రాత్రి పశువులు రోడ్డుగా అడ్డంగా కూర్చోవడంతో వాహన దారులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై గంటల తరబడి పశువులు తిష్ట వేయడంతో పార్కుకు వచ్చిన వారితోపాటు స్థానికుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కార్పొరేషన్ అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని నగర వాసులు కోరుతున్నారు.

– కడప కోటిరెడ్డిసర్కిల్

# మన జిల్లా చందమామ నాగిరెడ్డి

**నేడు బి.నాగిరెడ్డి జయంతి**



బీవీ నాగిరెడ్డి




చందమామ మాసపత్రిక

కడప కల్చరల్ : తెలుగు సినీ వినీలాకాశంలో ధృవతార బి.నాగిరెడ్డి. బాల సాహిత్యానికి తెలుగు నాట బ్రహ్మరథం పట్టేలా చేసిన చందమామ పత్రిక వ్యవస్థాపకులు ఆయనే. తెలుగు సినీ, సాహితీ రంగాల మూలాల్లో ఆయన కీర్తి శాశ్వతంగా నిలిచి ఉంది. డిసెంబరు 2న ఆయన జయంతి. ఈ సందర్భంగా ఆయన గురించి క్లుప్తంగా కొన్ని వివరాలివీ..

బి.నాగిరెడ్డిగా పేరుగాంచిన బొమ్మిరెడ్డి నాగిరెడ్డి కడప జిల్లా సింహాద్రిపురం మండలం ఎద్దులయ్య గారి కొత్తపల్లె గ్రామంలో 1912 డిసెంబరు, 2న జన్మించారు. అప్పట్లో వారి కుటుంబీకులు మద్రాసు నుంచి ఉల్లిపాయల ఎగుమతులు చేసేవారు. ఈ నేపథ్యంలో నాగిరెడ్డి మద్రాసు హైస్కూలులో చదివాడు. స్వాతంత్ర్య పోరాటానికి ఆకర్షితులై ఒక వైపు ఉద్యమం, మరోవైపు తండ్రి నుంచి స్వీకరించిన ఎగుమతుల వ్యాపారంలోనూ అంచెలంచెలుగా ఎదిగాడు. 17వయేటనే ఇతర దేశాలకు వెళ్లి వ్యాపారం సాగించాడు. కుటుంబ సభ్యులు నిర్వహించే బీఎస్‌కే ప్రెస్ వైపు మనసు మళ్లగా ఆంధ్రజ్యోతి పత్రిక 1945లో ప్రారంభించారు. 1947 జులైలో మద్రాసు కేంద్రంగా డాల్టన్ పబ్లికేషన్ ద్వారా పిల్లల కోసం ప్రత్యేకంగా చందమామ మాసపత్రిక ప్రారంభించారు. దేశంలోని 13 భాషల్లోనూ, అంధుల కోసం ప్రత్యేకంగా బ్రెయిలీ లిపిలోనూ వాటిని ప్రచురించారు. అప్పట్లో చందమామ నాగిరెడ్డిగా ఆయనకు గొప్ప పేరుండేది. నాటి ప్రధాని మురార్జీ దేశాయ్ నాగిరెడ్డి కనిపించినపుడు బాగున్నారా...చందమామ రెడ్డిగారు అని పిలిచేవారు. మహిళల కోసం ఆయన ప్రచురించిన వనిత మాసపత్రిక, సినిమాల కోసం విజయచిత్ర పత్రిక ఆ రంగాల్లో సంచలనాలు సృష్టించాయి. ఆయన 1963లో ప్రింటింగ్ ప్రెస్ స్థాపించారు.

**సినీ రంగంలోనూ..**

అప్పటికే ఆయన సోదరుడు బీఎన్ రెడ్డి (బి.నరసింహారెడ్డి) చలన చిత్ర దర్శకులుగా ఉండడంతో సోదరుడితో కలిసి ఈయన వాహినీ నిర్మాణ సంస్థ స్థాపించారు. ఈ స్టూడియో ఆసియాలోనే పెద్దదిగా పేరు గాంచింది. 1950లో విజయ ప్రొడక్షన్ నిర్మాణ సంస్థ స్థాపించారు. వీటి ఆధ్వర్యంలో షావుకారు, పాతాళభైరవి, మాయాబజార్, జగదేకవీరుని కథ, గుండమ్మకథ తదితర ట్రెండ్ సెట్టర్ సినిమాలను రూపొందించారు. ఆయన తీసిన మల్లీశ్వరి సినిమా దేశంలో గొప్ప క్లాసిక్ సినిమాగా నిలిచింది. హిందీలోనూ హిట్ సినిమాలు తీశారు. 1972లో మద్రాసులో దేశంలోనే గొప్పదిగా విజయ ఆస్పత్రిని నిర్మించారు. టీటీడీ చైర్మన్‌గా పనిచేసిన ఆయన 1987లో అత్యంత ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్‌ఫాల్కే అవార్డు పొందారు.